**అక్టోబర్ 10న చలో వంశధార**
**- అరెస్టులు చేస్తే మరింత ఉద్యమం**
**- పూర్తి పునరావాసం తర్వాతే**
**గ్రామాలను ఖాళీ చేయించాలి**
**-రౌండ్‌టేబుల్ సమావేశంలో**
**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు**

వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్బంధకాండకు నిరసనగా అక్టోబర్ 10న చలో వంశధార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు వెల్లడించారు. దీనికి పది వామపక్ష పార్టీలు, ఇతర పార్టీల నేతలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంలో కూడా ప్రభుత్వం అరెస్టులకు పూనుకుంటే తమ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వంశధార నిర్వాసితుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవాడ ఎంబివికెలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్రంలో వంశధార ప్రాజెక్టు తరహా నిర్వాసితులు లక్షలాది మంది ఉన్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు కింద 2.50 లక్షల మంది నిర్వాసితులుగా ఉన్నారన్నారు. వారు ఎదుర్కొనే సమస్యపై ప్రశ్నిస్తే ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. నిర్వాసితులకు 36 రకాల పునరావాస సేవలు పూర్తిగా కల్పించిన తర్వాతే గ్రామాలను ఖాళీ చేయించాలన్నారు. వ్యక్తిగతంగా లబ్ధిదారులకు డబ్బులివ్వకుండా, ప్రభుత్వమే పునరావాస బాధ్యతలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కడప జిల్లా గండికోటలో ఇళ్లు, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం గ్రామాల్లోకి నీటిని విడుదల చేసి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. దీంతో వారు చేసేదేమీ లేక గ్రామాలను ఖాళీ చేసినట్లు చెప్పారు. వంశధార, పోలవరాల్లోనూ ఇదే తరహా విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార ప్రాజెక్టు పనులు ఇప్పటికే 95శాతం పూర్తయ్యాయని, మిగిలిన 5శాతం పనులు పూర్తి చేసి తానే ప్రాజెక్టు పూర్తి చేశాననే గొప్పలు చెప్పుకోవడానికి సిఎం చంద్రబాబు ఉవ్విళ్లూరుతున్నారని ఎద్దేవా చేశారు. పునరావాస చట్టం ప్రకారం ఒక గ్రామానికి ఒకేచోట పునరావాసం కల్పించాలన్నారు. వేర్వేరు చోట్ల గృహాలు నిర్మించకూడదన్నారు. డబ్బులివ్వడం పునరావాసం కాదని, భూమికి భూమి, ఇళ్లకు ఇళ్లు ఇవ్వడమే పునరావాసమన్నారు. నిర్వాసితులను సంతృప్తి పరిచి భూములు సేకరించాలే తప్పా, దౌర్జన్యంతో కాదన్నారు. అక్కడి అధికార పార్టీకి చెందిన కిందిస్థాయి నేతలకు రూ. 5 లక్షల ప్యాకేజీకి అదనంగా మరో రెండు, మూడు ప్యాకేజీలు ఇవ్వడం వల్ల వారు నోరు మెదపడం లేదని విమర్శించారు. కానీ తమ పోరాటాన్ని మాత్రం కొనసాగిస్తామన్నారు. రాజధాని నిర్వాసితులకు కూడా ఏ హామీనీ నెరవేర్చలేదన్నారు. వారికి ప్లాట్ల కేటాయింపులోనూ అన్యాయమే చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార నిర్వాసితులకు మద్దతుగా వచ్చే నెల 16, 17 తేదీల్లో విజయవాడలో 30 గంటలపాటు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ ఎంపి మిడియం బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. వంశధార పనులు పోలవరం ప్రాజెక్టు కంటే ముందే ప్రారంభమైనా పనుల నిర్వహణలో ప్రభుత్వం దోబూచులాడుతోందని విమర్శించారు. ఆయా ప్రాజెక్టులు సక్రమంగా చేపట్టకపోవడంతో చాలా గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదన్నారు. ఈ సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి
ఉందన్నారు. నిర్వాసితుల సంఘం ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి మాట్లాడుతూ వంశధారలో 3600 మందికే ఇళ్ల స్థలాలు ఇచ్చారని, మరో 7,200 మందికి పునరావాసానికి స్థలాలు ఇవ్వలేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత సహా నిర్వాసిత కుటుంబాలన్నింటికీ 5 సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులను మూడు వేల మంది పోలీసులతో ప్రతి రోజు నిర్బంధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తోంది**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ**

2013 భూసేకరణ చట్టాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తూ పేదల భూములను దోచుకొంటోందన్నారు. దీనిపై నిర్వాసితులను పరామర్శించేందుకు వెళ్లే నాయకులను సైతం అరెస్టులు చేయడం దారుణమన్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలను ప్రభుత్వం సేకరించి కార్పొరేట్లకు ధారాదత్తం

చేస్తోందన్నారు. దీనిని సమర్థంగా ఎదుర్కొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**ఇంత నిర్బంధం ఎప్పుడూ లేదు**

**వైసిపి నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు**

భూ నిర్వాసితులపై ప్రభుత్వం ఇప్పుడు విధిస్తున్నంత నిర్బంధం గతంలో ఎన్నడూ చూడలేదని వైసిపి నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చట్టాల పరిధిలోనే వ్యవహరించాలన్నారు. ఈ సమస్యలు వంశధార, పోలవరానికో పరిమితం కాదన్నారు. రాష్ట్రంలో చట్ట ప్రకారం భూసేరకణ చేయడం లేదన్నారు. వంశధార సమస్యకు ఇప్పటికి 55 ఏళ్లు దాటాయన్నారు. దీనివల్ల రూ. 933 కోట్లు ఉన్న ప్యాకేజీ రూ. 1616 కోట్లకు పెరిగిందన్నారు. ఆయా ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లకు పెంచిన విధంగా నిర్వాసితులకు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూల్స్ ప్రకారం పంటను దున్నడం పెద్ద తప్పు అన్నారు. కానీ ప్రభుత్వం వంశధారలో 400 ఎకరాలను అక్రమంగా దున్నేసిందన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు ఆపకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలు ఎక్కువ అవుతాయన్నారు. రైతుసంఘం నాయకులు రావుల వెంకయ్య మాట్లాడుతూ భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు విలువను పరిగణలోకి తీసుకోకుండా భూమికి భూమి ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం ఒక్కో చోట ఒక్కో విధంగా ఇష్టం వచ్చినట్లు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు దడాల సుబ్బారావు, ఎపి రైతు సంఘం కార్యదర్శి వై కేశవరావు, ఎంసిపిఐ నాయకులు బి వెంకటరెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు కె రామారావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కిషోర్, సిపిఐఎంఎల్ (లిబరేషన్) నాయకులు డి హరినాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు నిర్వాసితులు సంఘం నాయకులు జి సింహాచలం, ఎన్ నరసింహారావు తదితరులు మాట్లాడారు.